"కన్యాకాలే యత్నాద్వరితా"

పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు

జాము పొద్దెక్కింది. చైత్ర పున్నమి వెళ్లింది కనక అప్పుడే యెండ చుఱుకుంటోంది.

రాయవరం ఎనభై యిళ్ల బ్రాహ్మణాగహారంలోనూ అప్పటికప్పుడే వంటలయిపోతున్నాయి; గాని జానకమ్మ మాత్రం అప్పుడే చెరువుకి బయలుదేరింది. చెరువుకి వెళ్ళడానికి రోజూ ఆమెకిదే సమయం. ఇంటి పనులన్నీ దాసీది చేసేస్తుంది; కనక తొమ్మిదింటికి చిల్లర పనులు ముగించుకుని మొగుడితో యేకబంతిని చద్దన్నం తినేసి మొగుణ్ణి తొమ్మిదిన్నరకి అలారం పెట్టమని చెప్పి, ఆమె యేపుస్తకమో పుచ్చుకుని కూచుంటుంది. పార్వతీశం తనకి పుస్తకాలంటే సహజమైన అభిరుచి లేకపోయినా జానకమ్మకోసమే రెండు వందల రూపాయల పుస్తకాలొక్కమాటే కొన్నాడు. అయిదారు మాసపత్రికలు కూడా తెప్పించుతాడు. ఎప్పటికప్పుడు కొత్తపుస్తకాలూ వస్తూవుంటాయి. పుస్తకం పుచ్చుకుందంటే యిక ఆమెవ్వరితోటీ మాట్లాడదు. ఎవరేనా పలకరించినా కొంచెం అసంతృప్తి తెలుపుతూనే జవాబు చెబుతుంది; కాని అలారం వినపడిందంటే మాత్రం ఎక్కడికయిన పుస్తకం అక్కడికే ఆపేసి వెంటనే బిందె పుచ్చుకొని బయలుదేరుతుంది.

రోజూ ఆసమయాని కెవరూ వుండేవారు కారు; గాని ఆవేళ మాత్రం పొరుగూరి బ్రాహ్మడొకడు స్నానం చేసి, తడి అంగవస్త్రం నెత్తిమీద వేసుకుని, చెరువులోనే నుంచుని జపం చేసుకుంటున్నాడు. అంచేత ఆమె చెరువులో దిగడానికి సిగ్గుపడి, పావంచాలకి పక్కని వున్న రావిచెట్టు కింద అటూ యిటూ చూస్తూ నుంచుంది.

సరిగ్గా యీసమయంలో యిరవై యేళ్ల వితంతువొకామె వెతుక్కుంటూ దగ్గిరికి వచ్చి యెంతో ప్రేమతో "నీ పేరేవరమ్మా?" అని అడిగింది. జానకమ్మ దానికి చాలా ఆప్యాయంగా "జానకమ్మండీ పిన్నిగారూ" అని బదులు చెప్పింది.

"నేను నీకు పిన్నిని కాను."

"ఏ మాతారూ మరీ?"

"దయ వుంచే అక్కయ్యా అని పిలు."

"అయితే మరీ సంతోషం. నాకు చెల్లెళ్లే గాని అక్కలు లేరు. మిమ్మల్నే అక్కగా చూసుకుంటాను."

"అలా అయితే యిక 'మీరు' అనడం యెందుకూ మరీ?"

"కొత్తకాదూ? అలవాటయిందాకా 'నువ్వు' అనడానికి యెబ్బెట్టుగా వుంటుంది."

"నిన్ను పిలిచాను గాదూ నేనూ?"

"పిలిచారు. నిజమే—"

"అదిగో మళ్లీ—'వొసే అక్కయ్యా' అని పిలు."

"వొసే?"

"ఏం?"

"మీరు నన్ను వొసే అన్నారు కారెం మరీ?"

"నాకూ అలవాటు లేకే. ఇక 'వొసే' అంటే 'వొసే' అనుకుందాం. ఏం?"

"అలాగే."

"ఏదీ అలా పిలూ."

"నీ పేరేవరే అక్కయ్యా?"

"ప్రాణాలు లేచివస్తున్నాయి నువ్వలా అంటేనూ. నా పేరు రంగనాయికమ్మ."

"............"

నెల్లాళ్లనుంచి చూస్తున్నాను నీతో మాట్లాడాలనీ. మీ రిద్దరూ కూడా చద్దన్నం తింటారు కనక నువ్వు పొద్దెక్కి వస్తావుకదా అని నేనూ ఆలాగే వొస్తున్నాను; గాని నువ్వెప్పుడూ తారసపడలేదు. ఎప్పుడేనా యిద్దరమూ వొక్కమాటే రావడం తటస్థించినా యెవరో వుంటూ వుండడం చేత మాట్లాడకుండా వునూరుమంటూ వెళ్లిపోతూవచ్చాను. ఇవాళ లేచిన ముహూర్తం మంచిది."

"వొక్క మాటేనా చెప్పారు—"

"మళ్లీ మీ రంటున్నావే"

"ఇంకా నలగలేదు కాదుటే?"

"ఎప్పుడేనా వొంటిగా దొరక్కపోతావా అని వూరుకుంటూ వచ్చాను. ఇవాళ దొరికావు."

"నిన్ను చూసినప్పుడల్లా మాట్లాడా లని నాకు కూడా తోస్తూ వచ్చింది. ఏమిటో సాహసించలేక పోతూ వచ్చాను. నీ మొగం చూశాటప్పటికి యెక్కడో చూసినట్టూ, కొన్నాళ్లు కలిసి వున్నట్టూ,— యేమిటో మనస్సు వురకలు వేసుకువచ్చేది."

"దృఢమైన ఋణానుబంధం యేదో వుంది మనకి. వెనకటి జన్మలో యిద్దరమూ వొక్క కడుపున పుట్టి వుంటాం."

"అలాగే తోస్తోంది."

"అదిగో ఆబ్రాహ్మడు వెళ్లిపోతున్నాడు నీళ్లు పోసుకుందాం రా మరి."

"పద."

౨

ఏనుగుగున్నలాగ ముందు రంగనాయికమ్మా, హంసపిట్టలాగ వెనక్కాల జానకమ్మా బిందెలు బుజాల మీద వేలాడవేసుకుని బయలుదేరారు. హఠాత్తుగా కలిసిన యీ స్నేహానికి ఆశ్చర్యమూ, యెక్కడా నసుకు లేకుండా వొక్కమాటే — వొక్క క్షణంలోనే పెనవేసుకుపోయిన యీ చుట్టరికానికి ఆనందమూ, యీ రెండూ సమానంగా మిళితం అవడంచేత కొత్తగా పుట్టిన ననుసిగ్గుదొంతరలూ — యీ మూడూ కలిసి ఆయిద్దరి మొగాలమీదా నృత్యం మొదలుపెట్టాయి. అంచేత చివరి పావంచామీదకి వెళ్లేదాకా రంగనాయికమ్మ వెనక్కి తిరిగి చూడలేకపోయింది. జానకమ్మ పలకరించలేకపోయింది. అప్పుడేనా అవి మూడూ యింకా గుబగుబ పొంగిపోతూ వుండడంచేత అతిప్రయత్నంమీద అడచుకుంటూ, అటూ యిటూ చూస్తూనే బిందెలు పావంచాల మీద పెట్టి, చెర్లో దిగి, గుండెల లోతుకి వెళ్లి, కంఠాలదాకా నీళ్లలో మునిగి, మళ్లీ కబుర్లందుకున్నారు.

"వొక్కమాటు కౌగిలించుకోనివ్వవుటే చెల్లీ?"

"ఊఁ."

జానకమ్మ యిలా అంటూ చేతులు చాపగా రంగనాయికమ్మ బ్రహ్మానందపడిపోయి, "యెవరేనా చూస్తున్నారేమో బాబూ" అని నాలుగువేపులా చూసి జంకుతూనే గభీ మని ఆమె కౌగిటిలో చేరి గట్టిగా—ఆత్మలు పూర్తిగా కలిసిపోయే టంత బింకంగా నొక్కింది. జానకమ్మగూడా అలాగే చేసింది.

ఈస్థితిలో వా రిద్దరూ కామమూ ప్రణయమూ కలిసిపోయినట్లూ, సౌఖ్యమూ ఆనందమూ మిళావు అయిపోయినట్లూ, స్వర్గమూ మర్త్యలోకమూ మిళితమైపోయినట్లూ, జీవాత్మ పరమాత్మ ఐక్యం అయిపోయినట్లూ వున్నారు. ఇలాగ వొక్క—కేవలమూ వొక్క క్షణకాలం మాత్రమే వున్నారు. వుత్తరక్షణంయొక్క ప్రారంభంలోనే విడిపోయి వొకరికొకరు గజం దూరంలో నిలుచున్నారు. ఇద్దరికళ్లల్లోనుంచీ ఆనందబాష్పాలు జాలువారి ఆపల్లెటూరి చెరువులో అంతర్భూతములై త్రివేణీసంగమస్థానం కంటే దానికి పావిత్ర్యం సమకూర్చాయి.

తరువాత "యేడుపు వస్తోందే చెల్లీ!" అంటూ రంగనాయికమ్మ కళ్లల్లో నీళ్లు పెట్టుకుంది. మాట్లాడలేక—బాష్పావిష్కరణంచేత చూపుగూడా సరిగ్గా చూడలేక జానకమ్మ తలవూపింది. ఇద్దరి పెదవులూ

రావిశేకల్లాగ అల్లల్లాడిపోయాయి. ఇద్దరికంఠాలు రుద్ధస్వరా లయిపోయి శరీరాలు గరిపొడిచాయి.

"చెల్లీ ..."

"...ఏం...అక్కయ్యా?"

"ఈ దయ...యీ...అనుగ్రహం ......బతికి ఉన్నంత...కాలమూ..."

"అదేమి...టే...అ...క్కయ్యా...అలా.... అంటావు?"

"ఏదీ చేతిలో చెయ్యివెయ్యా"

మాట్లాడకుండా జానకమ్మ చెయ్యి చాపింది. ఇద్దరూ వొకరిచెయ్యి వొకరు గట్టిగా పట్టుకున్నారు.

ఈసమయంలో వొక శూద్రస్త్రీ యెవరిమీదో రుంజుకుంటూ వచ్చి గబగబా బిందె ముంచుకుని చక్కాపోయింది.

"నీతో మాట్లాడా లనీ, నీతో స్నేహం చెయ్యా లనీ, నిన్ను 'చెల్లీ' అని పిలిచి, నీచేత 'వొసే అక్కయ్యా' అని పిలిపించుకోవా లనీ నేను తల్లడిల్లిపోతున్నాను. నువ్వు తారసపడినన్నీ నీతో మాట్లాడ్డానికి వీలు లేకపోయినప్పుడల్లా నాహృదయం దహించుకుని పోయీది. తల తిరిగిపోయీది. కాళ్లు వణకిపోయీవి. ఈజన్మకి యీసుఖం — యీ ఆనందం — యీ సౌభాగ్య మేనా కలగ దేమో నని యింటికి వెళ్లాక తల నొప్పి వచ్చిం దని వంక పెట్టి వొక్కత్తినీ గదిలో కింద పడుకుని కుమిలికుమిలి యేడ్చీదాన్ని"

"........................"

"ఎవతితో నేనా యీ దుఃఖం వెళ్లబోసుకుంటే కొంత భారం తగ్గివుండును; గాని నోరు విప్పడానికి యిష్టం లేకపోయీది. విప్పలేకే పోయీదాన్ని"

"........................"

"ఇలాగ వున్నదుఃఖం వున్నట్లే వుండగా కొత్త దుఃఖం వచ్చి గుండెలకి యెగతన్నీది...చెల్లీ! చెబితే నువ్వు నమ్మవు. నటన అని కూడా అనిపిస్తుంది; కాని నే నొక్కొక్కప్పుడు తలుచుకుని తలుచుకుని మరణవేదన — జ్ఞాపకం వస్తే...ఏడుపు..."

"..................."

"నువ్వు గూడా యేడుస్తున్నావే. యేడవకమ్మా! యెవరేనా చూస్తే — యేది యే మైనా నువ్వు నాకు చెల్లెలివైనావు. నన్ను అక్కగా అంగీకరించావు. ఇలాగేనా దుఃఖం మరిచిపోవడానికి — నీ సుఖమూ, నీ ఆనందమూ — నువ్వే నే నని తృప్తిపడడానికి ఈశ్వరుడు మార్గం చూపించాడు."

ఈ సమయంలో మళ్లీ ఒక దేవాంగియువతివచ్చి "వేసంకాలం అయితే మాత్రం చలివెయ్యడం లేదుటండీ మీకూ?" అంటూ బిందె ముంచుకుని జవాబుకోసం చెవులు వెనక్కి వోరచేసుకునే కాళ్లీడ్చుకుంటూ చక్కాపోయింది.

"ఇవాళ యేకాదశి" అంటూ రంగనాయికమ్మా, "నిన్న నే స్నానం" అంటూ జానకమ్మా జారుముడులు విప్పేసి పల్లెవాడు వల వేసినట్లు కేశపాశాలు నీటిమీదికి విసిరేశారు. దానితో చెరు వంతా నాచు కమ్మేసినట్లయిపోయింది. అంత లోతులో వుండినన్నీ యిద్దరూ చేతులతో నీళ్లు చల్లుకునే స్నానాలు చేసి ఆతికష్టం మీద మళ్లు వేసుకున్నారు.

"అసలు మొదట నన్ను నీ మొగుడికి యివ్వడానికి నిశ్చయం అయింది."

"యెందుకు తప్పిపోయిందీ మరీ?"

"నా అదృష్టం మంచిది కనకా"

"అంటే?"

"నేను మోడునై పోయినా అతన్ని కళ్లతో చూసుకుని ఆనందించడాని కేనా పెట్టిపుట్టాను కనకా. పెద్దదాన్ని కాకుండానే నాకు మొగుడు చచ్చిపోయీ యోగం వుంది. పై సమ్మంధం అయింది కనక అతను బతికాడు. దుఃఖం బాగా యెరగనప్పుడే నే నిలా అయిపోయినా పక్కపాపిడి తీసుకుని కండువా జందెప్పెట్టుగా వేసుకుని అత నలా వెడుతూవుంటే

"అదృష్టవంతుడు కనక నేను తప్పిపోయాను" అనుకుని ఆనందిస్తూ వుంటాను."

"ఆసమ్మంధం వొల్లకా దనలేకపోయావా?"

"రెండు రోజులు మా అమ్మదగ్గిర యేడ్చాను. 'నే చెబుతా కాదూ? వూరుకో అమ్మా' అనీది మా అమ్మ. ఇంతకీ యోగం లేకపోయింది."

"........................"

"నువ్వు గృహప్రవేశానికి వచ్చి వూరేగుతూ—పల్లకీ మావీధిలో ఆగినప్పుడు అమాంతంగా పల్లకీలోకి దూకి నీపక్కని కూచోవా లన్నంత సరదా వేసింది నాకు"

"........................"

"నువ్వు తొలీమాటు కాపరానికి వచ్చినప్పుడు ఎన్నో విధాల ప్రయత్నించాను; కాని కనపడ్డావు కావు."

"........................"

"నెల్లాళ్లకిందటే నువ్వు మలిమాటు వచ్చినా యిప్పటి—యీక్షణం దాకా యోగం లేకపోయింది చూశావా?"

"అవు నవును."

ఇలా చెబుతూ చెబుతూ రంగనాయికమ్మ హఠాత్తుగా పాంచాలకేసి చూసి, వులిక్కిపడి, "అదిగో మా పెద్దన్నయ్య కాబోలు వసున్నాడు" అని లేచి, "దయ వుంచవే చెల్లాయీ" అంటూ పాంచాల మీద వున్న బిందె తెచ్చుకుని నీళ్లు ముంచుకుని "మళ్లీ రేపూ కాస్త ఆలస్య మైనా వుండాలి సుమా" అంటూ మాట వినిపించుకోకుండా చక్కా పోయింది. అది చూసి అప్రతిభయై "వాళ్లన్నయ్య చూస్తే యేమి?" అని తర్కించుకుంటూ జానకమ్మ నింపాదిగా—రంగనాయికమ్మఅన్నగారిని బెదిరిబెదిరి చూస్తూ వెళ్లిపోయింది.

3

మండువా వాకట్లో పడకకుర్చీలో పడుకుని పార్వతీశం యేదో ఆలోచించుకుంటూ వుండగా చెరువు నుంచి తడిబట్టలతో వచ్చిన జానకమ్మ బిందె బుజమ్మీదే వుంచుకొని చిరునవ్వు నవ్వుతూ యెదట నుంచుంది. యోచనావ్యగ్రుడై వుండడంచేత అతను మొదట, ఆమె అలా నుంచునివుండడం గమనించలేదు; గాని హఠాత్తుగా చూసి కుర్చీలో సరిగ్గా కూచున్నాడు. పదిహేడేళ్ల పిల్లయినా సలాకలాగ బక్కపలచని మనిషి కనక కుంచెడు తప్పేలా బరువుకే ఆమె వూగిసలాడిపోతోంది. అది చూసి అతను మందహాసం చేస్తూ "చాలా బరువులు కలిశాయి పాపం, బిందె యింటో దింపి రారాదూ అంత పని వుంటేనూ?" అని అడిగాడు. ఈ మాటతో ఆమె ముఖానికి కొత్త అరుదం వచ్చింది; గాని దానికి జవాబుచెప్పక అలాగే నుంచుని, అలాగే మందహాసం చేస్తూ "మీ కెన్ని సమ్మంధాలు వచ్చాయండీ మొదటా?" అని బదులడిగింది.

"అ దేమిటి?"

"చెబుదురూ."

"అంటే?"

"వినపడలేదూ?"

"అర్థం కాలేదు."

"వులకం"

"అబద్ధం ఆడుతున్నా ననే?"

"పోనీ మళ్లీ అడుగుతాను. మీ కెంతమంది పిల్లల్నిస్తా మని వచ్చారూ మొదట?"

"రావడం యెంతమంది వచ్చినా వచ్చినవా ళ్లందరూ వొకొక్క పిల్లనే యిస్తా మన్నారు; కాని—"

"కాని మాట అడగలేదు నేను."

"అయిన మాటే చెబుతున్నాను. అయితే—"

"అయితే గియితేల కేం అవసరం వచ్చిందీ యిప్పుడూ?"

"నేనూ అదే అడుగుతున్నాను. ఏంపని—"

"పనుంది."

"ఏమిటో?"

"అదంతా మీ కెందుకూ?"

"........................."

"చెప్పరూ?"

"నువ్వు చెప్పావా యేమిటి?"

"దాచుకోండి"

"......వెళ్లిపోతా వేం? చెబుతా రా పాపం."

"అ-క్క-ర్లే-దు."

ఇలా అంటూ ఆమె వూదలాగ యింటోకి చక్కాపోయింది. వెనక్కి తిరిగి చూడ నేనా చూడ లేదు.

ముఖంమీద అంకిత మైన అసంతృప్తీ, నడకలో ప్రత్యక్ష మైన దురుకూ చూసి పార్వతీశం గాభరా పడ్డాడు. "కోపం తెప్పించాను" అని అతను కించ పడ్డాడుకూడాను. నిజానికి జానకమ్మ మాటకారే; గాని వుపసంహారించుకోవలసిన మాటలెప్పుడూ వాడదు. అడగవలసిం దేదేనా వుంటే సూటిగానూ, స్పష్టం గానూ, మృదువుగానూ, మితంగానూ అడుగుతుంది; గాని అదే పని పట్టుకుని వేళ్లాడదు. కోరిందిచెయ్యక పోయినా ధుమధుము లాడదు.

ఈ సంగతి అతనికి బాగా తెలుసు. అయినా వాదం అంటే అతను చెవికోసుకుంటాడు; కనక తిరుచు ధోణి అలా వచ్చేస్తూ వుంటుంది. ఇప్పుడూ అలాగే జరిగింది. తీరా జాగిపోయిన తరవాత యిక నే మను కుంటే మాత్రం యేం లాభమూ? వొక్క క్షణం అత న ప్రతిభుడై అలాగే కూచున్నాడు. వుత్తరక్షణంలో గభీ మని లేచి "ఈ కోపాన్ని బలపడనివ్వకూడ" దంటూ వంటింటోకి బయలుదేరాడు.

చూడగా తలుపు వేసివుంది. పిలవగా "పొత్తు పంచె కట్టుకుంటున్నానండీ" అని బదులు వచ్చింది. అది విని మాట్లాడకుండా మధ్యమధ్య గొళ్లెం కదుపుతూ అత నలాగే నుంచున్నాడు.

మళ్లీ అతను కత్తు కలపడానికి వచ్చాడని ఆమెకి తెలుసు. అయినా బతిమాలినకొద్దీ బిర్రబిగిసే రకం కాదు. కనక పనికాగానే ఆమె తలుపు తీసి "యేం?" అంది.

"నువ్వడిగింది చెప్పడానికి."

"నే నే మడిగానూ?"

"పోది అడుగుదామా?"

"........................."

"ధూపం నేనే వేస్తానులే."

"పొయ్యి మండిపోతోంది. మీతో మాట్లాడు తూ కూచోడాని కిప్పుడు వీలా?"

"మండీ పొయ్యిమీద తవ్వెడుగిన్ని పడేస్తే ఆరెండూ కలిసి నీళ్లతో తన్నుకుంటూ వుంటాయి. ఇక మన పని మనం చేసుకోవచ్చు."

"ఇం కేమీ పని లేదూ?"

"ఇది పని కాదూ?"

"దాటిపోయింది కదూ?"

"వెనక్కి లాగేద్దాం. మనకి చేత గాదా యేమిటి?"

"వెనకటిది ముందూ ముందటిది వెనకానా?"

"అదో అందం."

"శాబాసు."

"పొరపా టన్నది అందరికీ వస్తుంది. అంత కత్తులమీద పరీక్ష—"

"ఎవరు చేశారూ?"

"నేనే. కనక క్షమించు."

"........................."

"నువ్వలా చూశా వంటే నాకు గుండెలు దూ సుకుపోతాయి"

"బాగానే వుంది"

"అయితే యిక తగువెందుకూ మరీ? తడిబట్ట ఆరేసి వస్తావా, యీమాట కూడా తప్పులో నే చేరు స్తానా?"

దీని కామె బదులుచెప్పక వొక్క నిశితకటా క్షం విసిరేసి, యెదటి గోడదగ్గర పీట పరిచి, "కూ చోండి" అని మాత్రంచెప్పి దొడ్లోకి వెళ్లిపోయింది.

౪

ఆమె మళ్ళీ వచ్చేటప్పటికి పార్వతీశం "కథ యెలా మొదలుపెట్టనూ?" అని ఆలోచించుకుంటు న్నాడు. అది తేలకుండానే ఆమె వచ్చి, పాయికి సమీపంగా చిన్నపీట వేసుకొని కూచుని, "మరి చెప్పండదేమిటోను" అంది.

"మొదట వరసగా అయిదుగురు పెద్దమనుష్యులు నాకు పిల్లనిస్తామని—"

"అయిదుగురూ వొక్క పిల్లనే?"

"బహులు తీర్చుకున్నావూ?"

"వులు కలుగుతుంటుంది కాబోలు."

"తప్పకుండానూ. ఎవరికీ అంతే కాదూ? మరి తరవాతి కథ విను."

"ఆ అయిదు సమ్మంధాలూ యెందుకు తప్పి పోయారూ?"

"వొకటి మా నాన్నకి నచ్చలేదు. వొకటి మా అమ్మ వొప్పుకోలేదు. వొకటి లాంఛనాల దగ్గిర బెడిసి పోయింది. వొకటి నాకు నచ్చింది కాదు. వొకటి అంతా సిద్ధమయినీ మా నాన్న హఠాత్తుగా చచ్చి పోవడంచేత దాటిపోయింది."

"మీ నాన్న చచ్చిపోతే ముహూర్తం మారి పోవాలి; గాని సమ్మంధమే దాటిపోవడం యేం?"

"పిల్ల కట్టుతప్పి వుండడంచేత మరో ముహూర్తం వెంటనే కావాలన్నారు వారు. సంవత్సరమధ్యంలో మావాళ్లు పనికిరాదన్నారు. కానైతే ఆలోపుగా వారూ చెయ్యలేకేపోయారు పెళ్లి; గాని అంతలో నా పరీక్ష పోవడంచేత వంకలు పన్ని మరో సమ్మంధం చూసుకున్నారు."

"పెళ్లి దాటిపోవడమూ, పరీక్ష పోవడమూ—"

"అవునవును. మా నాన్న పోవడంచేత పెళ్లి తప్పిపోయింది. పెళ్లి తప్పిపోవడంచేత పరీక్ష పోయింది."

"అంత బెంగెందుకూ? పెళ్లికోసమా? ఆపిల్ల—"

"ఆ పిల్లకోసమే. ఆసమ్మంధం కుదిరినందుకు మొదట నేను వెయ్యినుంది దేవుళ్లకి మొక్కుకున్నాను. తప్పిపోయినందుకు తరవాత చాలారోజులుదాకా మతి పోయి—"

"అంత యిష్టమా ఆపిల్లమీద?"

"ఆరోజుల్లో మాట అది"

"ఇప్పుడో?"

"ఈమాట నువ్వెందుకడుగుతున్నావో తెలుసు. అయితే నేను నిన్ను మోసం చెయ్యడం లేదు. ఇప్పుడు నీమీద యెంత యిష్టమో, అప్పుడాపిల్లమీద అంత—"

"యెలా తిరిగిపోయిందండీ?"

"కోరిందల్లా సమకూడడానికి మనం దేవతలం కాము. అవుతుందంటే ఆశపడ్డాను. కాదంటే బెంగపెట్టుకున్నాను. ఆ ఆశ యెలా పోయిందో ఆ బెంగా అలాగే—"

"మొగాళ్లంతట్లో తిప్పేసుకుంటారు కాబోలు మనస్సు?"

"తిప్పేసుకుంటారంటే—ఇప్పటికిన్నీ—"

"అక్కర్లే దక్కర్లేదు. తరవాతి కథ—"

"నే నేమేనా దాస్తున్నానా?"

"నే నా మాట అనలేదు. తరువాతి కథ చెప్పండి. మీరు తప్పిపోయినందుకు ఆపిల్ల యేం చేసిందో—"

"నా కంటేనూ ఘోరం చేసింది. ముహూర్తం దాటిపోయినందుకు బెంగపెట్టుకుంది. మరో సమ్మంధం కుదిరాక నాలుగుపవాసాలు చేసింది. పెళ్లిలో వొక్కమాటేనా పీటమీద సంబరపడుతూ కూచోలేదుట."

"ట"

"టా కాకపోతే నేను చూశానా? అలా చెప్పారు చూసినవాళ్లు. వూళ్లోవాళ్లంతా చాలా వుద్ఘాటంగా చెప్పుకున్నారు కొన్నాళ్లదాకానూ."

"ఏమనీ?"

"ఆపిల్ల ఆపిల్లాడితో కాపరం—"

"పెళ్లి అయిన తరవాత యేం జరిగిందీ?"

"తరవాత గూడా ఆపిల్ల మనస్సు నామీద నుంచి తప్పిపోలేదు."

"ఎలా తెలిసిందీ?"

"నువ్వొక్కడికి మనుగుడుపులకి వచ్చినప్పుడు, తెల్లవారగట్ల ప్రయాణం అనగా రాత్రి నీకు మల్లె మొగ్గల దండ వేశాను జ్ఞాపకం వుందా?"

"వుంది. అప్పుడు నాబుగ్గకి మీ వేలు తగిలి వొళ్లంతా గరిపొడిచింది."

"ఇంక నేమీ? ఆదండ ఆపిల్ల పంపించినదే. తరవాత చెప్పింది నాకు మా సుబ్బత్త కూతురు."

"ఊహూ"

"మరో మాటు—అనగా నువ్వు మా అక్క కూతురు బాలసాలకి వచ్చినప్పుడు మళ్లీ బుట్టెడు గులాబీపువ్వులు పంపింది. వొక్కి పంపేశాను"

"అయ్యో"

"నీకు గులాబీపువ్వులు—అసలు పువ్వులంటే నే సంబరం అని తెలుసు; కాని ఆపిల్ల అలా చేసినట్లు తెలిస్తే నాళ్లవాళ్లు కోప్పడరూ? సమ్మంధం తప్పిపోయాక మాకు మాటలు కూడా పోయాయి"

"తరవాత యెప్పుడేనా మీ రా పిల్లతో మాట్లాడారా?"

"లేదు"

"ఆపిల్లేనా—"

"చాలా మాట్లు ప్రయత్నం చేసింది. తప్పించుకున్నాను. వొకమాటు సాహసించి యేదో వేళాకోళం చేసింది. బదులు చెప్పడం మానేశాను"

"ఎంత చిన్నపుచ్చుకుందో పాపం"

"కావచ్చు. కాని దానికీ నాకూ యింకేం సమ్మంధమూ?"

"ఎంత తీసేసుకున్నా అది మీ పెళ్లామే"

"నిజానికంతే. దానికి జరిగింది రెండో పెళ్లే"

"ఇంకేమీ?—"

"కాని లోకం మాట చెప్పు"

"లోకం సంగతి పోనిస్తురూ. ఆపిల్లపే రేం రూ?"

"రంగనాయిక."

"మీకు బాగుందా ఆపేరు?"

"నిక్షేపం—"

"నా పేరుకంటే వెయ్యిరెట్లు బాగుంది కదూ! మావూళ్లో—"

"మీ దే వూరూ?"

"తప్పే. మావాళ్ల వూళ్లో మాయింటి—కాదు కాదు. మావాళ్ల యింటి దగ్గిర వొక పిల్ల వుంది"

"వుంటే?"

"దాని పేరు రంగమ్మ."

"అయితే?"

"రంగనాయికమ్మ అని పిలిపించుకోమని యెన్నో మాట్లు చెప్పాను దానికి."

"పేరు మంచిదే. రూపం కూడా సాటి లేనిదే. వైధవ్యం వచ్చినా యిప్పుడు కూడా ఆమె చాలా అందంగానే వుంది."

"బూడిదలో పోసిన పన్నీరూ. ఏం లాభమూ? అయితే తరవాత మీ కెప్పుడేనా కనపడిందా?"

"లక్షమాట్లు—"

"మీరు కనపడ్డప్పుడు దాని మొగం—"

"నేను చూశానా?"

"వేశారు తప్పదాటు."

"ఏం?"

"పోనీ మీ కెలా వుండేది చెప్పండీ?"

"ఎప్పుడేనా అయ్యో—"

"ఎప్పుడేనానా? నిజం చెప్పండి."

"వొట్టూ"

"వొట్టు వద్దు. పాపం అది యెంత దుఃఖిస్తోందో?"

"మొగుడు చచ్చిపోతే దుఃఖం కామా?"

"తప్పు తప్పు వోగాయిత్యం మాట లనకండి."

"నీ ధోరణి యిలా వుందేం జానీ యివేళ?"

"ఆడాళ్ల బతుకు యింతటిదే కదా?"

"చెప్పవూ?"

"పాపం వీరేశలింగంగారు——"

సరిగ్గా యీసమయంలో యెవరో వచ్చి పిలుపు మీద పిలుపు పదిసార్లు పిలిచారు పార్వతీశాన్ని. చేసేది లేక "ఎవరు వా" రంటూ అతను లేచి వెళ్లిపోయాడు. వొక్క క్షణందాకా జానకమ్మ స్తబ్ధ అయిపోయి అక్కణ్ణుంచి కదల్లేకపోయింది. కొంతసేపటికి వచ్చిన మనిషి భర్తవేపు చుట్టం అని గ్రహించి ఆగిన్నె దింపేసి మూడు సోలల గిన్నెతో యెసరు పెట్టింది.

✂

తరవాత భోజనాల వేళదాకా ఆ దంపతులిద్దరూ కలుసుకోలేదు. అప్పుడేనా చుట్టం వుండడంచేత యీ ధోరణి రాలేదు.

రాత్రి కూడా ఆచుట్టం వుండి పోయాడు. పగలూ, రాత్రీ కూడా పార్వతీశానికి చుట్టంతోనే వుండిపోవలసివచ్చింది. రాత్రి పన్నెండు గంటలదాకా మొగుడు వాకట్లోనే వుండడంచేత ఆమె పదిగంటలదాకా కనిపెట్టుకుని వుండి తరువాత యిక వుండలేక నిద్రపోయింది. ఇంట్లోకి వచ్చాక పార్వతీశం లేపనూ లేదూ, తెల్లవారీదాకా ఆమెకి మెళుకువ రానూ లేదూ.

ఉదయం అయింది. కాలకృత్యాలూ, గృహకృత్యాలూ—ఇద్దరూ సంసారసాగరంలో పడిపోయారు. ఆసముద్రంలో చుట్టం వొక పెద్ద కెరటం అయి వారి నిద్దర్నీ దూరదూరంగా కొట్టేశేవాడు.

ఆవేళ మామూలు వేళకి జానకమ్మ కూడా వెళుక్కుంటూనే వెళ్లింది చెరువుకి; కాని పావుగంట ఆలస్యం చేసినా రంగనాయికమ్మ రాలేదు. మన్నాడు కూడా ఆమె రాలేదు. ఆమె సంగతి యేమిటి నేనా అడుగుదామంటే అదేం తప్పో? పెద్దన్నగారిని చూసి ఆవేళ రంగనాయికమ్మ మారు చెప్పకుండా వెళ్లిపోకపోతే ఆమెకీసందేహం కలక్కపోవును.

ఈ రెండు రోజులూ జానకమ్మకి యెలాగో వుంది. ఏదో వస్తువు పోయినట్టూ, యేదో మరిచిపోయినట్టూ—ఆమె మనసు తిన్నట్టయిపోయింది ఆమె నిరుత్సాహంగా వుండడం పార్వతీశం గమనించాడు; గాని "యేం?" అని కారణం అడగలేకపోయాడు.

మూడు రోజులనుంచి వున్న చుట్టం ఆవేళ మధ్యాహ్నం నాలుగ్గంటలికి వెళ్లిపోయాడు. పార్వతీశం సాగనంపుతూ తోళ్ళపూడిదాకా షికారుగా కూడా వెళ్లాడు. జానకమ్మ తానుగూడా సాగనంపుతూ గుమ్మందాకా వచ్చి, ఏమిటో కారణం లేకుండా అక్కడే అలాగే నిలిచిపోయింది.

మరో యేడెనిమిది నిమిషాలికి రంగనాయికమ్మ యెక్కణ్ణుంచో యింటికి వెడుతూ జానకమ్మ గుమ్మంలో వుండడం చూసి, మొగం యింత చేసుకునిన్నీ యెవ రేనా వస్తున్నా రేమో—చూస్తున్నా రేమో అని వెనక్కీ ముందుకీ బెదిరిబెదిరి చూస్తూ "రేపు స్నానం" అని మెల్లిగా అలుగోజాస్వరంతో చెప్పి క్షణమేనా నుంచోకుండా వెళ్లిపోయింది.

రంగనాయికమ్మ కనపడేటప్పటికి జానకమ్మకి కూడా ప్రాణాలు లేచివచ్చాయి. ఆమె చెరువుకి రాకపోవడానికి కారణం కూడా తెలవడం చేత హృదయభారం కూడా తగ్గిపోయింది; గాని ఆమాట చెప్పడానికామె అంత సంకోచించడమూ, జడుస్తూ వెనక్కీ ముందుకీ చూడడమూ జానకమ్మకి అర్థం కాలేదు. తమ

పుట్టింటివారికీ పార్వతీశానికీ సంభాషణా — చివరికి ముఖావలోకనాలూ లేవు కనుక బాహాటంగా తనతో మాట్లాడ్డానికి జంకుతోం దేమో అంటే అసలు అలాగేనా మాట్లాడ్డమూ, చెల్లీ అనడమూ, వొసే అక్కయ్యా అని పిలిపించుకోడమూ యెందుకూ?

జానకమ్మ కది యేమీ బోధపడలేదు; గాని రంగనాయికమ్మ స్నేహం విడవరానిదిగా కనపడింది. "అక్కయ్య అన్నట్టు వెనకటి జన్మలో వొక్క కడుపున పుట్టామేమో" అని కూడా ఆమె భావించింది. దాని మీద, వొక వూళ్లోనే వున్నా అత్తిళ్లవారికి గర్భశత్రుత్వం వున్నప్పుడు ఇద్దరు అప్పాచెల్లెళ్లిలాగే అవస్థపడుతూ వుంటారు కాబోలునని ఆమె ఆశ్చర్యపడింది.

*　　*　　*　　*　　*

ఇక్కడ జానకమ్మకీ, అక్కడ రంగనాయికమ్మకీ కూడా ఆరాత్రి చాలా భారమైపోయింది. కళ్లు పొడుచుకున్నా నిద్ర రాదు. ఏమీ తోచదు. ఎంతకీ తెల్లవారదు.

ఇలా వుండగా రంగనాయికమ్మ తనలాగే అచ్చంగా పుణ్యస్త్రీ అయి తనతో సరిగా తన యింటో మసులుతూ వున్నట్లు తెల్లవారుజామున జానకమ్మకి కల వచ్చింది. ఇంకా స్తసేపటిదాకా మెళుకువ రాక పోతే కల అంతా పూర్తి అయి సంగతంతా బోధపడి వుండును; గాని వొత్తిగిల్లడంలో పార్వతీశం చెయ్యి మీద పడడంచేత మెళుకువ వచ్చి కల అసంపూర్ణంగా తేలిపోయింది.

వెంటనే ఆమె లేచి కూచుంది. ఆమె కేమీ తోచలేదు. చివరికి రంగనాయికమ్మ చూపిస్తూ వున్న మమకారాన్ని తలుచుకుంటూ ఆమె మళ్లీ పడుకుంది.

౬

చివరికి తెల్లవారింది. "పందలపాకలో పని వుం" దంటూ ఆవేళ పార్వతీశం ఆరున్నరకే చద్దన్నం తినేసి బైసికిలు ఎక్కి వెళ్లిపోయాడు. మడి కట్టుకోడం యెలాగా అయిపోయింది కదా అని జానకమ్మ కూడా అప్పుడే చద్దన్నం తినేసింది; కాని యెంతసేపటికీ టైంపీసు అలారం కొట్టదు. అది కాదని యిదీ, యిది కాదని అదీ నాలుగైదు పుస్తకాలూ, వొకటి రెండు మాసపత్రికలూ తిరగవేసింది; గాని దృష్టిలేక అవి నడవలేదు. అందుచేత జానకమ్మ ఆవేళ గదిలో నుంచి వాకట్లో వున్న టైంపీసుదగ్గిరకీ, అక్కణ్ణుంచి గదిలోకీ, మధ్యమధ్య వీధిగుమ్మంలోకీ యెన్ని మాట్లు తిరిగిందో లెక్క లేదు.

ఇక్కడిలా వుండగా అక్కడ రంగనాయికమ్మ పని గూడా యిలాగే వుంది. అక్కడ కూడా సూర్యగతి యిలాగే వుంది. యెంతసేపటికీ పాలికాపు నద్దన్నానికి రాడు. దొడ్డిగుమ్మంలోకి వొకమాటూ వీధి గుమ్మంలోకి వొకమాటూ చొప్పున యెన్ని మాట్లు వచ్చి చూసినా బ్రాహ్మణస్త్రీలు స్నానాలకోసం వెళ్లేవాళ్లు వెడుతూ, వచ్చేవాళ్లు వస్తూనే వున్నారు.

"వేళ అయిందో లేదో అని యిలాగ యింటి దగ్గిరే పాతుకుపోయి వుంటే అది వచ్చి వెళ్లేపోతుం దేమో" అని యెవరి మట్టుకు వారే యిద్దరూ కూడా చివరి కొక్కమాటే బయలుదేరి పావంచాల దగ్గిర కలుసుకున్నారు. వొకర్ని వొకరు చూసుకునేటప్పటికి ఇద్దరికీ గూడా ఆనందం తలమునకలైపోయింది. శరవేగంతో వచ్చే రెండు నదులు గభీమని కలుసుకునేటట్టు యిద్దరూ రావిచెట్టుకింద కలుసుకొని బ్రహ్మానందంతో కౌగిలించుకోబోయారు; గాని చెరువులో వొక ముసలి బ్రాహ్మణస్త్రీ బట్టలు పిడుచుకుంటూ వుండడం చూసి తెల్లబోయి నాలుకలు కరుచుకుంటూ విధిలేక వెనక్కి తగ్గారు.

తరవాత అక్కడే నుంచుంటే యెవ రేనా యేమేనా అనుకుంటా రేమో అని పావంచాల మీద కూచుని యిద్దరూ బిందెలు తోమడం మొదలు పెట్టారు. కొంతసేపటికి ముసలమ్మ గంగాస్తవం అందుకుని యెత్తెత్తి కాళ్లు వేసుకుంటూ వెళ్లిపోయింది.

౭

అక్కాచెల్లెళ్లిద్దరూ చెరువులో దిగి, గుండెల లోతుకి వెళ్లి, యథాపూర్వంగా గట్టిగా కౌగిలించుకుని మళ్లీ కబుర్లు కందుకున్నారు.

"అతని దగ్గిర నామాట యేమేనా తెచ్చావా యేమిటే చెల్లీ?"

"లే దక్కా"

"వొద్దు వొద్దు. బాగుండదు. కానైతే దీన్లో యేమీ తప్పు లేదు; గాని—అయినా యెందుకూ?"

"నువ్వేమంటావో అని వూరుకున్నానే"

"పోనీ వోమాటు కదిపి చూస్తావా?"

"ఏ మన మంటావూ?"

"ఏ మన మంటానా? ....సిగ్గూ నవ్వూ కూడా వస్తున్నాయి......పోనీ మానేస్తే?"

"నీయిష్టం."

"వూరుకో."

"కాని నిన్ను విడిచి వుండడం—"

"నా పనీ అలాగే వుంది. ఈ మూడు రోజులూ నాకు నిద్రాహారాలు లేవు. నిన్నరాత్రి కలగూడా వచ్చింది."

"........................"

"నువ్వూ, నేనూ, అతనూ యెందుకో రాజమండ్రీ—యెవరో వస్తున్నారే."

ఇద్దరూ మంగాళ్ల మీద నిలిచి, నలుగురు శూద్రస్త్రీలు వస్తూవుండడం చూసి, కొంచెం కొంచెం దూరంగా జరిగి, వొకరితో వొకరికి సమ్మంధం లేనట్టు చెరో వేపుకీ తిరిగి, వొళ్లు తోముకోడం మొదలు పెట్టారు.

శూద్రస్త్రీలు వచ్చారు. వొకామె జానకమ్మనీ, వొకామె రంగనాయికమ్మనీ పలకరించారు. నలుగురూ వెళ్లిపోయారు.

అక్కాచెల్లెళ్లిద్దరూ యెవ రేనా వస్తున్నారేమో అని మళ్లీ మంగాళ్ల మీద నిలిచి చూసి, మళ్లీ దగ్గిరసా చేరుకున్నారు.

"మా యింటి కోమాటు రావుటే అక్కయ్యా?"

"అమ్మయ్యో!"

"ఏం?"

"నీ మొగుడు చూస్తే—"

"చూస్తే?"

"ఇంకేమేనా తరవాయి వుంటుందా?"

"ఏమంటా రేమిటమ్మా?"

"మాట్లాడడు. అంతకంటే యేం కావాలీ?"

"నేను మాట్లాడిస్తానే"

"నువ్వు చెప్పినట్టు వింటాడా?"

"వినక యే చెరువు నీళ్లు తాగుతారూ?

"నిజంగా?"

"చూడరాదూ?"

"నన్ను స్వర్గాని కెక్కిస్తున్నావే చెల్లీ"

ఇలా అంటూ ఆమె జానకమ్మ బుగ్గ తాకింది.

"వారికి తెలవకుండా నువ్వు దొడ్డిదారిని వచ్చి యింటో కూచో. వీధిలో యెవరితోనో మాట్లాడ తూ మాట్లాడుతూ కాస్తసేపటికి మంచినీళ్లు కావాలని యింటోకి వస్తారు. నేను తలుపు చాటున నుంచుని వుంటాను. వెండి గళాసుతో నువ్వందించు మంచి నీళ్లు"

"బాబోయి"

"ఏమే?"

"ఆమాట వింటేనే కాళ్లు వొణికిపోతున్నాయి నాకు."

"సింగినాదం కాదూ?"

దీనికి సమాధానం చెప్పకుండా, ముసిముసినవ్వులు నవ్వుకుంటూ వొక్కక్షణం పక్కకి చూసి, రంగనాయికమ్మ గంభీరంగా చూస్తూ "అతను గళాసు అందుకోకపోతే నేను చచ్చిపోవాలి గాని వేరో దారి వుందా?" అంది.

"నే నంటాను కాదుటే?"

"........................."

"ఏ మంటావు? రావే. వొక్కమాటు రా. యేం?"

"రావా లనీ వుంది."

"యింకేం? సందేహపడకు. రా. వస్తా ననూ."

"పోనీ వొక పని చెయ్యి."

"ఏమి టదీ?"

"ఇవాళ సుబ్బమ్మ పిన్ని కూతురుచేత మల్లి మొగ్గల దండలు రెండు పంపిస్తాను. వొకటి అతనికి వెయ్యి."

"వేసి?"

"నేను పంపా నని చెప్పి మరీ వెయ్యి."

"వేస్తే?"

"ఏమీ లేదూ? దానిమీద యేం జరుగుతుందో నాతో చెప్పు. నిజంగా—జరిగింది జరిగినట్టు చెప్పాలి సుమా"

"ఇన్ని తికమక లెందుకే?"

"అలా కాదు. నేను చెప్పినట్టు చెయ్యి. అలా చేస్తే అతనికి నామీద దయ వుందో లేదో తెలుస్తుంది"

"దయ వున్నట్టు తెలిస్తే?"

"మా వాళ్లు యేమో చేస్తా రని నా కేమీ భయం లేదు. వాళ్ల లెక్క లేదు నాకు"

"దయ వున్నట్టు తెలిస్తే? ఏమిటో చెప్పు మరి?"

"మీయింటికి వస్తాను"

"నిజంగా? చేతిలో చెయ్యి వెయ్యి"

ఇలా అంటూ జానకమ్మ చెయ్యి చాపగా రంగ నాయికమ్మ ఆచెయ్యి గట్టిగా పట్టుకుంది.

"నిన్ను చంపుకు తిన్నట్టే. తప్పకుండా వస్తాను. ఈమూడు రోజులూ నిన్ను చూడకుండా నే వుండలేక పోయాను. అది తెలిస్తే విడిచి—"

"తప్పకుండా పంపిస్తావు కాదూ?"

"భోజన మేనా మానేసి పంపిస్తాను"

"ఎన్ని గంటలికి?"

"అయిదు. తప్పితే ఆరింటికి"

"వున్న మొగ్గలన్నీ మాకే పంపేస్తే మీ వాళ్లేమీ అనరూ?"

"మాయింటో మొగ్గలు వొక్క టేనా ముట్టుకోను. సుబ్బమ్మ పిన్నిగారి యింటో రోజుకి గంపెడు మొగ్గ లవుతాయి. అందరికీ యిచ్చెయ్యడమే కాదూ మా రత్తమ్మక్కయ్యా?"

"నిన్న మాకూ పంపించింది."

"ఇవాళ నేను పంపుతాను."

"........................."

"రెండు దండలూ నేనే గుచ్చుతాను. అరిటి దొప్పలో పొట్లం కూడా నేనే కట్టి పంపుతాను."

"పంపు."

"గంధంకూడా తీసి పంపనా?"

"నిన్ను మరీ మెచ్చుకుంటారు."

"మెప్పా?"

"ఏం?"

"చివాట్లు—"

"పూరుకోవే."

"చూస్తావు కాదూ?"

"వింటావు కాదూ?"

"సంయే."

"సంయే."

ఇద్దరూ మళ్లీ వో మాటు ముంగాళ్లమీద నిలిచి చూశారు. దూరాన ముగ్గురు వైశ్యస్త్రీలు కనపడ్డారు.

"కోమట్లు మనలాగే కబుర్లు మొదలేస్తారు. పోదాం రా."

"లే."

"నువ్వు వెడతావా ముందు నేను వెళ్లనా?"

"పోనీ నన్ను వెళ్లనియ్యి."

"వెళ్లు......ఏదీ చెల్లీ యింకో మాటూ."

జానకమ్మ యింకో కౌగిలింత యిచ్చి వెళ్లి పోయింది. రంగనాయికమ్మ ప్రేమసూచకంగా మెటికలు విరిచి, చిన్నప్పుడు పార్వతీశానికి తనమీద యిష్టం కలిగేటట్లు సుబ్బమ్మగారి రత్తమ్మద్వారా తాను పడిన పాట్లన్నీ తలుచుకుంటూ వైశ్యస్త్రీల వెనకాల వెళ్లింది.

౮

"చెవు డెప్పణ్ణుంచే?"

"నాలుగు రోజుల నుంచి."

"ఇక కళ్లు కూడా మూసుకు పోతాయి కామోసు."

"నా కళ్లు పోవా లని వుందా?"

"నీ కళ్లు పోతే నాకేం వస్తుందీ? నా కళ్లే పోవాలి."

"మీ కళ్లు పోయినా రాదూ ఏమీనీ."

"వస్తే వస్తుంది పోతేపోతుంది; గాని యిదిగో మల్లి మొగ్గల దండలు."

"రోజూ యెందు కమ్మా?"

"గంధం కూడా యిదిగో"

"సరే"

"తల కూడా నేనే దువ్వాలిట నీకు"

"ఎవ రన్నారుట?"

"ఏం సంగ నాచివే?"

"................."

"నవ్వుకుని వూరుకుంటావేం?"

"ఏం చెయ్యమంటా రమ్మా మరీ?"

"తొరగా కూచో. పిండి కూడా విసురుకోవాలి యింకానూ"

"మాయింటికి విందుకు రండి"

"అమ్మ మాటో మరీ?"

"ఆవిడా వస్తారు"

"మరో మాటు వస్తాములే. తొరగా రా అమ్మా. కని పెట్టుకుంటుంది నేను వెళ్లీదాకానూ"

బొట్టు పెట్టే, అగురుసూనె దగ్గిర పెట్టుకుని జానకమ్మ అద్దం యెదట కూచుంది. వేళాకోళాలూ, వెక్కిరింతలూ చేస్తూ క్షణంలో తల దువ్వేసి, ఆమె మొగం కడుక్కుని వచ్చి కాటుక పెట్టుకోగా బొట్టు పెట్టి "మరి పోతా" నంటూ రత్తమ్మ నంచోకుండా చక్కాపోయింది

*   *   *   *   *

ఎనిమి దయింది. వట్టివేళ్ల చాప లప్పుడే తడపడం చేత కషాయగంధబంధురమై పిల్లగాలి చల్లగా వీస్తోంది. వాషింగ్టన్ లైటు వసారానంతా వెలుగులో ముంచెత్తేస్తోంది.

"గంధంలో యేమిటో కలిపా వీవేళ"

"చెప్పుకోండి."

"తెల్ల గులాబీ కాదూ?"

"అవునని మాత్రం అన్నానా నేనూ?"

"..........."

"..........."

"చేతి కందిస్తే యెలాగా? బల్ల మీద పెట్టరాదూ?

"పుచ్చుకో గూడదా యేమిటి?"

"అయితే తే మరి."

"సూచులాగ యెంత చల్లగా వుందో?"

"నీ మనస్సులా నే చల్లగా వుంది కాదూ?"

"..........."

"..........."

"మీగుణం పోనిచ్చుకోరు"

"నీగుణంమాత్రం పోనిచ్చుకున్నావా?"

"..............."

"ఆలస్యం చేసుకోవడం తప్ప మరేమీ లాభం లేదు"

"మ-ౕరే"

"............"

"............"

"కొన్నావా యేమిటి? మల్లి మొగ్గలు"

"కొనక్కర్లేకుండానే వచ్చాయి"

"ఎవరు పంపారూ ?"

"వో తాయిలంగారు"

"మా రత్తమ్మ వదినేనా?"

"తేవడం ఆవిడే"

"ఎవ రిచ్చారూ?"

"ముహూర్తం దాటిపోతే మొదలే పోయిందీ? ఆవిడా"

"ఏమిటే?"

"సంతోషించారా?"

పార్వతీశం గంభీరంగా చూశాడు. అంతకంటేనూ గంభీరంగా జానకమ్మ బదులు చూసింది.

"............"

"............"

"ఏ మాతుంనో యెరుగుదువా? "

" ఇదివరకే అనుకుంటున్నాం మేము 'వొసే చెల్లాయీ' అంటే 'వొసే అక్కాయ్యో' అనీ"

"..............."

"బాగుందా ?"

"..............."

"మాట్లాడ వేం?"

"అదా సంగతి?"

"మన యింటికి వచ్చేస్తుంటాట"

"..............."

"ఏం?"

"చాదస్తమూ కాదు వెర్రీ కాదు నీదీ"

"చిన్నప్పుడెంతో ఆశపెట్టారట పాపం. వుసురు తగలదూ మీకూ? ఆడదాన్నేడిపిస్తే జయం కలుగుతుందా ?"

"భగవంతుడు చేసినదాని కెవ రేం చేస్తారూ ?"

"ఇక ముందు కూడా అలా అని వూరుకుంటారా మరి?"

"నీ సంగతి ఆలోచించుకున్నావా ?"

"వండి పెడుతూ యిద్దరికీ చాకిరీ చేస్తాను"

పార్వతీశం వొక్క క్షణం దిగ్భ్రాంతుడై వుండి, వుత్తరక్షణంలో ఆమెని పొదివి పట్టుకున్నాడు. జానకమ్మ ఆబాహుబంధంలో నిలువునా కరిగిపోగా తామర తూడుకంటేనూ మృదువుగా వున్న ఆమె దేహాన్ని మరింత బిగిగా పట్టుకుని, అరమూసుకుని వున్న కళ్ల మీద అతను ముద్దు లుంచాడు.

౬

తెల్లవారింది. వూరికే కాదు. ఇక్కడ జానకమ్మనీ, అక్కడ రంగనాయికమ్మనీ కూడా రాత్రిఅస్తమానూ పక్కని బెట్టి రానేసి మరీ తెల్లవారింది.

పార్వతీశం వెంటనే కాల్యాలు తీర్చుకొని భోంచేసి అలారం సరిచేసి, బేరగాళ్లు రాగా బెల్లంతూపించి వెయ్యడానికి గరువుమీదకి చక్కాపోయాడు. జానకమ్మకూడా అన్నం తిని బీరువా దగ్గిరకి చేరుకుంది.

మొదట ఆమె వీరేశలింగం పంతులుగారి స్వీయచరిత్ర తీసింది. వొకటి రెండు పేజీలు చదివింది; గాని చూపు దానిమీద నిలవలేదు. అంతబదాన్ని బీరువాలో పెట్టేసి గాంధిగారి ఆత్మకథ తీసింది. వొకక్షణాని కది కూడా దాచేసి వచనభారతం వుద్యోగపర్వం తీసింది. తరవాత వచనరామాయణం సుందరకాండా, కథాసరిత్సాగరం మొదటిసంపుటమూ, అబలాసచ్చరిత్రరత్నమాల రెండో భాగమూ, రుక్మిణీకల్యాణమూ, గజేంద్రమోక్షమూ—ఇలాగ వొకదానితరవాతవొకటిచొప్పున పైవరస పుస్తకాలన్నీ తీసింది; గాని వొకటీ నడవలేదు.

తరవాత హార్మోనియం దగ్గిర కూచుంది. మొదట నోరు విప్పకుండా రెండుకృతులు వాయించింది. మరో పదినిమిషాలు నోటితో పాడుతూ వాయించింది. అయినా మనస్సుకి ఉల్లాసం కలగలేదు.

దానితో విసుపెత్తి గడియారం చూడగా కృత్యాద్యవస్థమీద పదినిమిషాలు తక్కువ యెనిమిదయింది.

ఆమె కేమీ తోచలేదు. ఇంతలో జలతారుకి గాజుపళ్లేలూ అవ్వీ యిచ్చీవాళ్లురాగా వొక అరగంట వేళుకబేరాలు చేసి వాళ్లని విసిగించి, తాను గూడా విసిగి, అవతలవీథినుంచి చెరువుకి వెళుతూ వొకయువతిరాగా ఆమెని కొసిరికొసిరి అయిదు నిమిషాలు నుంచోబెట్టి యేమిటేమిటో అడిగి, "పదింటికే భోజనం చేస్తే తరవాత యెంత సేపటికి పొద్దుగూకుతుందే మా తల్లీ" అంటూ ఆమెకి సెలవిచ్చింది. ఇంతచేసినా వాకట్లోకి వచ్చి గడియారం చూడగా యెనిమిదీ యిరవై అయిదునిమిషాలే అయింది.

ఆమె చాలా శాంతమైన పిల్ల గనక వూరుకుంది; గాని మరొకతె అయితే గడియారాన్ని నేలకి బెట్టి కొట్టేసి వుండును. అప్పుడామె "రత్తమ్మక్కయ్యేనా రాగూడదూ యిలాంటప్పుడూ?" అనుకుంది. "మధ్యాహ్నమేనా రాగూడదూ బేరగాళ్లూ?" అని కూడా అనుకుంది. చివరికి "రెండు ప్లేట్లు వేసుకుందాం" అనుకుని గ్రామోఫోను దగ్గిర కూచుంది.

జానకమ్మ రెండు ప్లేట్లేనా యేరి యేరి వేసిందో లేదో. అప్పుడు తన యెదట మరొకళ్లు పాడడం యిష్టం లేనిదానిలాగ టైంపీసు గణగణ మంటూ సాగదీసి రెండు నిమిషాలు అలారం కొట్టింది. వెంటనే ఆమె ఎక్కడి ప్లేట్లక్కడే అట్టేపెట్టి బిందె బుజంమీద వేలాడవేసుకుని మనస్సులో చాలా తొందరపడుతూ, అడుగులు మాత్రం మెల్లిగానే వేస్తూ చెరువుకి బయలుదేరింది.

అప్పటి కప్పుడే రంగనాయికమ్మ పావంచాల మీద కూచుని మాటిమాటికీ లేచిచూస్తూ బిందె తోముతోంది. వొకరికొకరు కనబడగానే యిద్దరికీ బ్రహ్మానంద మైపోయింది.

"ఏం జరిగిందే చెల్లీ?" అని రంగనాయికమ్మ అడగ్గా "నేను చెప్పలేదూ నిన్నా?" అంటూ జానకమ్మ బదులు చెప్పింది. తరవాత జానకమ్మ జరిగిందంతా —మల్లెదండల ప్రస్తావం వచ్చింది మొదలుకుని అక్షర మేనా విడిచిపెట్టకుండా చెప్పింది. "గంధాని కేమీ అనలేదూ?" అని రంగనాయికమ్మ అడిగింది. "అది నువ్వు పంపినట్లు యెరగదు. నేను చెప్పాలేదు సుమా" అని జానకమ్మ చెప్పింది.

చూస్తూ వుండగా రంగనాయికమ్మ కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి. పెదవులు వణకిపోయాయి. కంఠం గద్గదిక మైపోయింది. ఆస్థితి చూసి జానకమ్మ అప్రతిభ అవుతూ వుండగా రంగనాయికమ్మ యెలాగో తెరిపి చేసుకుని, మధ్యమధ్య అతికష్టంమీద గొంతుకు సవరించుకుంటూ "చెల్లీ! యీజన్మకిక ఆనందం లేదనుకుంటూ వుండగా నన్ను స్వర్గాని కెక్కించావు నువ్వు. నీ ఋణం తీర్చుకోలేను. ఇవి చేతులుకావు కాళ్లు" అంటూ ఆమె చేతులు పట్టుకుని యిక మాట్లాడలేక పోయింది.

ఆస్థితి చూడగా జానకమ్మకి గూడా అలాగే స్తబ్ధత కలిగింది. రెండు నిమిషాలదాకా యెవరూ మాట్లాడలేదు.

తరవాత రంగనాయికమ్మ పైట సవరించుకుంటూ "చెల్లీ! ఇక వెడతానే నేనూ. మా మరదలు పుట్టింటికి వెడుతుంది భోజనంచేసీ. ఈపాటికి దాని భోజనంకూడా అయిపోయే వుంటుంది. మళ్లీ రేపు—మీయింటికే వస్తాను రేపు యెలాగో వీలు చేసుకునీ. ఏమీ అనుకోకేం? తప్పులు మరిచిపోవేం?" అంటూ గడ్డం పట్టుకుని బతిమాలి, బిందె ముంచుకుని వెనక్కి తిరిగి చూస్తూ వెళ్లిపోయింది. తరవాత జానకమ్మ బయలుదేరింది. రంగనాయికమ్మ దుఃఖమూ, అదీ చూశాటప్పటికి ఆమెకి మనస్సు కలిగిపోయింది.

౧౦

సాయంత్రం ఆ రవుతోంది. పార్వతీశం బలరామరెడ్డి అనే మిత్రునితో కూడా పొలంనుంచి యింటికి వస్తున్నాడు. సూరావధానులు గారి (రంగనాయికతండ్రి) పెద్దదొడ్డి దగ్గిరికి వచ్చాటప్పటి కొక ముసలిది పలకరించి "రంగనాయికమ్మగోరు పిలుస్తున్నారు మిమ్మల్ని" అంది. "ఎందుకూ?" అంటే "ఏమో" అంది. "ఎక్కడుందీ?" అంటే "ఈదొడ్లోనే" అంది. పార్వతీశమూ, రెడ్డీ రెప్పవెయ్యకుండా వొకరికేసి వొకరు చూసుకున్నారు. రెడ్డిముఖంమీద వుత్సాహం కనపడలేదు. "అయినా వెళ్లి కనుక్కొనివస్తా నదేమిటో. ఇక్కడే వుండు" అంటూ పార్వతీశం ముం దడుగువేశాడు. "జాగ్రత్తసుమండీ" అని రెడ్డి ఆగుమ్మానికెదురుగా వున్న సందులో నుంచున్నాడు.

ముసలమ్మ చెప్పగా రంగనాయికమ్మ యెగిరెగిరి పడుతూ లేచి నుంచుంది గాని పార్వతీశాన్ని చూశాటప్పటికి యెక్కడలేనిసిగ్గూ వచ్చి అలుముకుంది.

"ఎందుకూ రమ్మన్నావుటా?"

"..........."

"మాట్లాడవేం?"

"..........."

"ఈదొడ్లో మీవాళ్లెవళ్లూ లేరుకదా?"

"లేరు."

"ఎందుకూ రమ్మన్నావూ?"

"ఇప్పటికి దయ వచ్చిందా?"

"నీ దయముందు నాదయ యెంతటిదీ?"

"కోటి గుణితం. ఇప్పటిదాకా నాకళ్లుమాత్రమే చల్లగా వున్నాయి. ఇప్పుడు హృదయంకూడా చల్లపడింది"

"..........."

"ఎంతో ఆశపడ్డాను; గాని అంతా మంచు విడిపోయినట్లు విడిపోయింది. చెల్లాయి అనుగ్రహంవల్ల మళ్లీ ఆశ కలుగుతోంది"

"ఏం చెప్పాలో దీనికి తోచడంలేదు నాకు"

"బెంగ పెట్టుకోవద్దని చెబితే చాలు"

"..........."

"పగ లెలాగేనా గడిచిపోతుంది. వొక్కొక్క రాత్రి మరణబాధ—వెయ్యతేళ్లొక్క మాటు కుట్టినట్టు—యెందుకిలా బతికివుండడం అనిపించేది"

"..... ....."

"పదిరోజులకో మాటేనా మీరు కనపడితే అంతా మరుపువచ్చేది. గాఢాంధకారంలో దీపంలా వుంటుంది మీదర్శనం"

"..........."

"గులాబీపువ్వులు తిప్పేసినా మొండికత్తి పలకరించాను. అప్పణ్ణుంచీ యమయాతనే. ఇప్పటికి పున్నమి వెన్నెట్లో పడ్డట్టయింది."

"నీ సాహసం చూస్తే ఆశ్చర్యకరంగా వుంది. చాలా గందరగోళం పుట్టవచ్చు"

పార్వతీశం యిలా చెబుతూ వుండగా "ఎవడవురా నువ్వు నా దొడ్లోకి—"అంటూ వొక రంకె వినపడింది. చూడగా వెంకటేశం ఆబోతులాగ మీదకి వస్తున్నాడు. పార్వతీశం పంచె సవరించుకునేప్పటికి మీదే పడిపోయాడు.

రంగనాయికమ్మ తెల్లబోయి వొక్కక్షణం మానుపడిపోయింది.

ఇద్దరూ కూడా మంచి నడివయస్సులోనూ మమ్మరంగానూ వున్నారు; కనక వెంకటేశమూ, పార్వతీశమూ, కుమ్ముకుంటూ, గుద్దుకుంటూ—ఏనుగుల్లాగ పోరుతున్నారు.

అంతట అది చూసి రంగనాయికమ్మ తా నేమీ చెయ్యలేకా, పార్వతీశానికి దెబ్బలు తగులుతూవుండడం చూడలేకా తటాలున తలుపు తీసి వీథిలోకి వచ్చి యెదుట సందు మొదట బలరామరెడ్డి కనపడగా "లోపల కొట్టుకుంటున్నారు" అని గోలపెట్టింది.

ఇది వినడమే తడవుగా రెడ్డి దొడ్డోకి వెళ్లి వురిమాడు. అది విని వెంకటేశం జంకగా పార్వతీశం ఆసందుపాట్లో మరో నాలుగు గుద్దులు గుద్ది సాగతీసి వొకతన్ను తన్ని "యిక రా" అంటూ రెడ్డితో కూడా యివతలికి వచ్చి సందులోనుంచి యింటికి వెళ్లిపోయాడు. ఆసందులోనే కాపురం వున్న రెడ్లలో అతని అనుచరులు బలరామరెడ్డి పిలవగా నలుగురు కూడానే వెళ్లారు.

* * *

వెంకటేశం రొజుకుంటూ వెళ్లి జరిగిందంతా చెప్పగా యింటిల్లపాదీ వులిక్కిపడ్డారు. "లంజముండని తన్నుండి రంగిలు" అంటూ సూరన్న యెగిరిపడ్డాడు. నలుగురమూ వెళ్లి సొంతిచేద్దాం రండి పార్వతీశంగాణ్ణి" అంటూ రామస్వామి నడుం కట్టాడు. "ఎంత పని చేశాడూ?" అంటూ సూరావధానులు నిశ్చేష్టుడైపోయాడు; కాని భీమన్నశాస్త్రిమాత్రం తొందరపడక తమ్ముళ్లని సద్దణచి "విన్నారా?" అని చుట్టూ కూచుని వున్న రయితులతో చెప్పి "మునసబుని తీసుకురా" అని వొక రయితు నంపాడు.

అంతటితో వూరుకోక వెంకటేశం "చితకపొడిచేశాను గాడిదకొడుకు" నంటూ యింటోకి వెళ్లి ఆడాళ్లకి అంతా చెప్పాడు. "అయ్యో" అంటూ ముసలమ్మ కూలపడిపోయింది. "ఏం పోయీకాలం వచ్చిందీ వొడినికీ?" అంటూ వెంకటేశంపెళ్లాం సాగతీసుకుంది. "రోజులు గడవాలి. అప్పుడే తీరిందా సంబరం?" అంటూ సూరన్నపెళ్లాం మొగం మాడ్చుకుంది. పెద్దకోడలు నోరు విప్పలేదు; గాని మూతీ, ముక్కూ ముడుచుకుంటూ అవతలికి చక్కాపోయింది.

వొకనిమిషం అయినాక ముసలమ్మ యింటో యేమూలాకూడా కనపడకపోగా వొగర్చుకుంటూ రంగనాయికమ్మకోసం చిన్నదొడ్లో నూతిదగ్గిరికీ, పెద్దదొడ్లో నూతిదగ్గిరికీ పరుగెత్తింది.

నాలుగ్గళ్ల రాత్రి దాకా ఆలోచించి నలుగురు రెడ్లని వెంటబెట్టుకొనివచ్చి పార్వతీశం వెంకటేశాన్ని తన్ని, కుమ్మి, గుద్ది, కొట్టి పారిపోయినట్లు మునసబు బకీరు రాశాడు. ఏదో కూనీకేసు కోసం పోలీసు సూపర్నెంటు లొల్లగ్రామంలో మకాంచేసి వుండడంచేత రాత్రికి రాత్రే బకీ రక్కడికే వెళ్లిపోయింది.

౧౧

తన వాలకంచూసి కంగారుపడుతూ వున్న జానకమ్మకి "ముందు మంచినీళ్లు—కాదు పాలు పట్టుకురా" అని చెప్పి పార్వతీశం మంచంమీద వాలగా బలరామరెడ్డి "బాధగావుందా?" అని అడిగాడు. "ఏడెనిమిది గుద్దులు గుద్దాడు. నాలుగైదుమాట్లు కుమ్మాడు. వాటివల్ల యేమీ బాధలేదు; గాని రొండురొమ్ములమీద పొడిచిన పోటుకి మాత్రం కొంచెం నొప్పిగా వుంది ...... డాక్టరుగారింకా వచ్చారు కారేం?" అని పార్వతీశం బదులడిగాడు. సంగతంతా విని జానకమ్మ బెంబేలుపడుతూ వుండగా డాక్టరువచ్చి స్టెతస్కోపుతో పరీక్షచేసి "గుండెలు అదిరాయి. అంతే. ఏమీ బాధకలగదు. భయం వద్దు. మందిస్తాను రండి" అనిచెప్పి బయలుదేరాడు. బలరామరెడ్డికూడా వెళ్లి వ్యవహారం మాట్లాడి మందు తెచ్చాడు.

ఈలోపుగా పార్వతీశం జానకమ్మతో సంగతంతా చెప్పాడు. అది విని ఆమె కళ్లల్లో నీళ్లుపెట్టుకోగా పార్వతీశం మందుతాగేసి వెంటనే లేచి వాకిట్లోకి వచ్చి కుర్చీలో కూచున్నాడు. "తూలిపోతా రండీ" అంటూ జానకమ్మ కూడానే వచ్చింది; గాని "యింతమాత్రానికే? వెంకటేశంగాడి రక్కులకే నేను పడిపోతా ననుకున్నావా? వొడ్డిమంగలి బాగా బింకంగా వొళ్లుపట్టినట్టుంది. అంతే" అంటూ పార్వతీశం ఆమెనీ, రెడ్డినీ నవ్వించాడు.

"ఏం? నేను తొందరపడ్డానా?" అన్నాడు పార్వతీశం. "తొందరలోనే చేరింది. అవిడేనా కనిపెట్టలేకపోయారు. అసలు తోటలోనే వున్నారు వెంకటేశంగా రేచెట్టుకిందో?" అన్నాడు రెడ్డి.

"కాని మహా చురుకైనవాడోయి"

"అలా తోచిందా?"

"నిన్ను చూశాటప్పటికి మాత్రం నవనాడులూ కుంగిపోయాయి"

ఇది విని రెడ్డి మందహాసం చేసి "ఛార్జీ యిస్తారు. నన్ను కూడా కలుపుతారు. మొన్ననే పేచీపడివున్నాడు కనక వోబిరెడ్డినీ, పాతపగని బట్టి లచ్చిరెడ్డినీ, కూడా కలపవచ్చు" అన్నాడు.

"అయితే హైకోర్టు చూశా మన్న మాటే"

"చులాగ్గానూ"

"కాని మీ రేమీ తొందరపడవద్దు"

"వెంకటేశంగారి నో దబ్బళింపు—"

"వద్దు వద్దు. ఎదిరిఛార్జీ గూడా మనం పెట్టవద్దు. ఆట్నుంచి నరుక్కువద్దాం"

"అవు నవును; కాని రంగనాయికమ్మగార్ని—"

"అదే బెంగగా వుంది. దన్ని బాధిస్తారు"

"అసలు సంగతి—"

"మన యింటికి రావడానికి నిమిషాలు లెక్కపెడుతోంది"

"ఇదివరకి చెప్పారు కారేం?"

"నిన్నరాత్రే తెలిసింది నాకు. ఈరాత్రి చెబుదా మనుకున్నాను నీకు"

"ఇక్కడ—"

"నీకా భయం అక్కర్లేదు"

ఇలా చెప్పి పార్వతీశం జానకమ్మకేసి తిరిగి "యీ పూట మీరంతా భోజనం యిక్కడే" అన్నాడు. "వద్దు వద్దు. యిళ్లల్లోనే భోంచేసి వస్తా"మని రెడ్డి చెప్పాడు; గాని పార్వతీశం అంగీకరించలేదు. జానకమ్మ కూడా "తప్పు"దంది.

మంగలి కళ్లిన మీదట "ఏమిటిరా బావా యీ అల్లరి అంతానూ?" అంటూ రత్తమ్మ రాగా "గొడవ అంతా పూర్తి అయ్యేదాకా ఏమీ మాట్లాడవద్దు; గాని నాలుగురోజులు వండిపెట్టాలి నువ్వు" అని చెప్పి పార్వతీశం వాగ్బంధనం చేశాడు. దాంమీద రత్తమ్మ వెళ్లీ మాట్లాడకుండా జానకమ్మని తీసుకుని యింటోకి వెళ్లిపోయింది.

మరో అయిదు నిమిషాలికి రత్తమ్మ యెక్కడికో వెళ్లిపోయింది. పార్వతీశం అడగ్గా "సుబ్బమ్మపిన్నిగారిని పంపిస్తుందిట" అని జానకమ్మ బదులు చెప్పింది. పార్వతీశం "యిక్కడికా?" అని అడిగి, ఆమె "కాదు" అని చెప్పగా "సరే. బాగుంది" అని బలరామరెడ్డికేసి సాకూతంగా చూశాడు.

* * *

రాత్రిపదిగంటలకి పార్వతీశమూ, బలరామరెడ్డీ వాకిట్లో కూచుని ముందు సంగతి ఆలోచించుకుంటూ వుండగా సుబ్బత్త వచ్చింది. "ఏమిటి సంగతి?" అనిపార్వతీశం అడగ్గా ఆమె "చేముట్టుసరసం యేమీ జరగలేదు; గాని మొగాళ్లు—నూరన్నా, రామస్వామీ, వెంకటేశమూ తలోమాటా చొప్పున దులిపేశారు. భీముడు మాత్రం యేమీమాట్లాడలేదు. ముసలావిడ నెత్తీ,నోరూ బాదుకుని తనకి తాను తిట్టుకుని వూరుకుంది. "నేను బుద్ధిపూర్వకంగా దాని గొంతుకోశాను. మీ రే మన్నా తలుచుకున్నా నన్ననండి" అని ముసలాతడు భారం అంతా తనమీద వేసుకున్నాడు. రంగనాయికమ్మ నీకు తగిలిన దెబ్బలు తలుచుకుని కుమిలికుమిలి యేడుస్తోంది. నన్ను తనదగ్గిర పడుకోమని ఆపేసిందది. నువ్వేమీ బెంగపెట్టుకోనక్కర్లేదు" అని బదులుచెప్పి జానకమ్మ దగ్గిరికి వెళ్లింది.

చూసీ చూడడంతోటే "యేం జరిగిందే అమ్మా" అంటూ రత్తమ్మా, "అక్కయ్య కులాసాగా వుందా దొడ్డమ్మగారూ?" అంటూ జానకమ్మా వొక్క మాటే అడిగారు. అందుకు సుబ్బత్త జరిగిందంతా చెప్పి "రంగనాయికమ్మ యిక నీమొగం చూడలేనంటోంది. పార్వతీశాన్ని పనిబట్టి తాను కొట్టించినట్లయిపోయిందని కగ్గోలు పడిపోతోంది. నువ్వు అభయం యిస్తేగాని యిక బతికలం అబద్ధం అంది" అని చెప్పి "పోతా, వూరు మాటుమణిగింది గదా అని దొడ్డిదారినివచ్చాను. దక్షిణపు వసారాలో పడుకున్నాం మే మిద్దరమూనూ" అంటూ లేచింది. అందుకు "అక్కయ్యని విడిచి వుండలే నని

"చెప్పండి" అని జానకమ్మ యీవొక్క మాటే చెప్పి ఆవిణ్ణి సాగనంపింది.

తరవాత పార్వతీశం రెడ్డితో వొంటిగంటదాకా ఆలోచనలు చేసి, అప్పుడు మళ్ళీ అర్ధశేరుపాలు తాగి, గుర్రున తేన్చి పడుకున్నాడు.

౧౨

కాలాని కేం పని వుందీ? మళ్లీ తెల్లవారింది. ఎర్రని కిరణాలతో సూర్యుడు పొడుపుకొండమీదికి రాగా, యెర్రనిటోపీలతో పోలీసులు వూళ్లోకి వచ్చారు.

రాత్రంతా గూడుపుటాణీ చేసిన మున్సబు కరణాన్ని ప్రలోభపెడుతూ సూపర్నెంటుకి యెదురుగా వెళ్లి "యేలినవారు కఠినంగా ప్రవర్తించక పోతే మీరు వెళ్లీపోగానే దొమ్మి జరుగుతుంది" అని చెవిలో వూదాడు "నాలుగు రాళ్లు రాల్తాయి"అని పెద్ద యినస్పెక్టరు మురస్గా "మీరు బాగా బిగపట్టాలి" అంటూ హెడ్డుకానిస్టేబులు మూతి బిగించాడు.

పోలీసులు వచ్చినట్లు పార్వతీశానికి గాలికబురు వచ్చింది. "కబురుపంపితే గాని మనం వెళ్లనక్కర్లే"దని రెడ్డి చెప్పగా పార్వతీశం "ఔ"నన్నాడు.

సూరావధాని అరుగుమీద సూపర్నెంటు కచేరీ చేశాడు. వూళ్లోవాళ్లు చాలా మంది వచ్చారు.

వెంకటేశం, "నలుగురు రెడ్లని (ఫలానా, ఫలానా) వెంటపెట్టుకొని వచ్చి మా పెద్దదొడ్లో పార్వతీశం నన్ను తన్ని, కుమ్మి, గుద్ది, కొట్టి పారిపోయాడు" అని పెద్దన్నగారు చెప్పిన పాఠం దొరకి అప్పగించేశాడు. పెద్దపాలికాపు సాక్ష్యం చెప్పడానికి ప్రమాణం చేసి నుంచున్నాడు.

సరిగ్గా యీ సమయంలో "దొరగారు చిత్తగించాలి" అంటూ దమయంతి అంతఃపురంలోకి దౌత్యం కోసం నలుడు వచ్చినట్టు వచ్చి వణకిపోతూ రంగనాయికమ్మ దొర కెదురుగా అరుగుకింద నుంచుంది. అది చూసి అంతా వుబ్బెత్తుగా లేచి నుంచున్నారు. వెంకటేశమూ, రామస్వామీ ఆమె నింటోకి గెంటెయ్యాలని "పద పద" అంటూ వచ్చారు; గాని "దొరగారూ! నన్ను రక్షించండి" అని ఆమె గోలచెయ్యగా, దొర యింగితం కనిపెట్టి పెద్ద యినస్పెక్టరు "హాండి" అంటూ వారి నిద్దర్నీ తోసేశాడు.

"అసలు కథ బైటికి వస్తోం"దన్నాడు దొర. "చిత్తం" అంటూ పెద్ద యినస్పెక్టరు మరో కాగితం తీశాడు. సూరావధాని మొగం వంచుకున్నాడు. భీమన్న శాస్త్రి తెల్లబోగా "కథ యెదురు తిరిగింది" అని మునసబు కుంగిపోయాడు.

అంతా సద్దణిగాక దొర అడగ్గా రంగనాయికమ్మ యిలా చెప్పింది:

"నన్ను మొదట మావాళ్లు పార్వతీశంగారికి స్థిరపరిచారు. తరవాత మరో సమ్మంధం చేశారు. నా మొగుడనిపించుకున్న పిల్లాడు సంవత్సరానికే చచ్చిపోయాడు. అప్పణ్ణుంచీ నామనస్సు పార్వతీశంగారిమీదే వుంది. వారి యింటికి వెళ్లిపోవా లని నేను దృఢపరుచుకున్నాను. ఈసంగతి చెప్పడానికి వారు పొలంనుంచి యింటికి వెడుతూ వుండగా చూసి మా పెద్ద దొడ్లోకి పిలిచాను. వారూ, నేనూ మాటాడుతున్నాం. ఇంతట్లో మా వెంకటేశం అన్నయ్య వచ్చి వారిమీద పడ్డాడు. ఇద్దరూ సమానంగా కొట్టుకున్నారు. కొంతసేపటికి విడిపించుకొని వారు వెళ్లిపోయారు... నే నిక యిక్కడ వుండలేను వారి యింటికి వెళ్లిపోతూ మీ యెదటికి వచ్చి యీ సంగతు లన్నీ చెబితే నాకేమీ చిక్కు లుండ వని వచ్చాను. నాకు మైనారిటీ వదిలిపోయింది. నాకు నేనే వారి యింటికి వెళ్లిపోతున్నాను. వొట్టి చేతులతో మీ యెదటికి వచ్చాను. నా నగలు మా నాన్నదగ్గిర వున్నాయి. ఇప్పించండి"

దొర, పెద్ద యినస్పెక్టరు, మునసబు ఎన్ని ప్రశ్నలు వేసినా ఆమె యీ మాటలు తప్ప లేదు.

అప్పుడు దొర "తప్పు టకీ రిచ్చినందు కేం చెబుతా"వని మున్సబునీ, "అబద్ధపువాఙ్మూలం యిచ్చినందు కేంచెబుతా"వని వెంకటేశాన్ని, "నీ కూతురి కేం సమాధానం

"చెబుతావయ్యా?" అని సూరావధానినీ టోకాయించి అడిగాడు. అంతా తెల్లపోయారు. చూడ్డానికి వచ్చిన వా రంతా కనుబొమ్మ లెగరవేస్తూ తల లూపేశారు.

అప్పుడు భీమన్నశాస్త్రి దొరయెదటికి మెల్లిగా వచ్చి "మా చెల్లెలి కెవరో దుర్బోధ చేశారు. దాన్ని యింటోకి తీసుకువెళ్లి మాట్లాడ్డానికి సెలవియ్యండి" అని కోరాడు. అందుకు దొర "ఏమంటా వమ్మాయీ?" అని అడగ్గా "నేను వొట్టిచేతులతో వచ్చి వుండడం మీరు చూసేవున్నారు. నాస్వబుద్ధి చేతనే నే నివతలికి వచ్చాను. నేను మళ్లీ మావాళ్ల యింటోకి వెళ్లను. నానగలమాటకి సమాధానం రాలేదు. ఇందుకు మీరే సాక్ష్యం. ఇదిగో నేను వెళ్లిపోతున్నాను. నా నగలు కోర్టు ద్వారానే వస్తాయి నాకాళ్లదగ్గిరికి" అంటూ గిరుక్కున మళ్లి వెళ్లిపోయింది.

౧౩

రంగనాయికమ్మ ఔచిత్యానికి భంగం లేనంత వడిగా బయలుదేరింది; కాని వొక బ్రాహ్మణయువకుడు వాయువేగాలమీద ముందువెళ్లి యీసంగతి పార్వతీశంతో చెప్పాడు. అప్పటి కప్పుడే పార్వతీశంవద్దన్నం తినేసి వుత్తరపువసారాలో బలరామరెడ్డితో మాటాడుతున్నాడు. ఇదివిని అతను "సెబాస్" అంటూ చెయ్యి జాడిస్తూ బ్రహ్మానందపడ్డాడు. ఆ ఆనందం పూర్తికాకుండానే జానకమ్మ స్వాగతం యివ్వడానికి వీథిలోకి వెళ్లింది.

రెడ్డి అడగ్గా యువకుడు పోలీసులు వచ్చింది మొదలు జరిగిం దంతా చెప్పాడు. పార్వతీశం తీవ్రంగా క్రాముచేశాడు. రెడ్డి మున్సబు మొగంలో కనపడిన మార్పును గురించిమాత్రమే తరిచి తరిచి అడిగాడు.

రంగనాయికమ్మ కింది చీడీ యెక్కేటప్పటికే "రావే అక్కయ్యా" అంటూ జానకమ్మ చేతులు చాపింది. ఆమె ఒక్కొక్కటే మెట్లు యెక్కేవచ్చిందో యెగిరే వచ్చిందోగాని చూడగా జానకమ్మ కౌగిటిలో వుంది. ఇద్దరికళ్లు గిర్రున తిరిగాయి. రంగనాయికమ్మ మాట రాకపోగా కళ్లతోటే బతిమాలగా జానకమ్మ ఆయింగితం గుర్తించి కళ్లతోటే అంగీకరించినట్లు చెప్పింది.

ఇంతట్లో పార్వతీశం వాకిట్లోకి వచ్చాడు. వెంటనే రంగనాయికమ్మ మన్మథబాణం లాగ అతని కాళ్లమీద వాలి "నేను మొండిపేనుగుని. మిమ్మల్ని కొట్టించాను. అయినా రక్షిస్తారని ఆశపడి వచ్చా"నంది. పార్వతీశం ప్రేమతో ఆమెని లేవనెత్తి "నువ్వు విచారించ నక్కర్లేదు వెంకటేశంబావ బావమరిది పరియాచకాలు చేశాడు. నేనూ బదులు తీర్చాను. వొకళ్లకి వొకళ్లం యేమీ బాకీ లేము; కాని నీకు మాత్రం నేను చాలా రుణపడిపోయాను" అన్నాడు.

రంగనాయికమ్మ మనోవ్యథ తీరింది. జానకమ్మతో కూడా ఆమె పడమటింటోకి వెళ్లిపోయింది.

అంతట్లో సుబ్బత్తవచ్చి "మా మరిది కొడుకు సలహామీద ఆవుపదేశం అంతా నేనుచేశా"నని చెప్పగా పార్వతీశము మరీ ఆనందించాడు. బలరామరెడ్డి "మీ వుపదేశంవల్ల రంగనాయికమ్మగారే కాదు. మేమూ వొడ్డెక్కాం" అని ఆమెని చాలా పొగడాడు.

లోపల యిలావుండగా దొర పరివారంతోటీ, మునసబుతోటీ, భీమన్నశాస్త్రితోటీ వచ్చి వీథిలో నిలిచి లోపలికి కబురుచేసి పార్వతీశం ఆహ్వానించగా లోపలికి వచ్చికూచుని "మీరు నే ంగల ప్రవేశంచేసినట్లూ, అమాయకురాలైన వొకబాలవితంతువుని లేవతియ్యడానికి ప్రయత్నం చేసినట్లు నాకు తెలిసింది. ఏం చెబుతారు దీని?" కని అడిగాడు.

"ఆవిషయం ఆవితంతువు మీయెదుట విన్నవించే వుంది. అక్షరాలా అంతే జరిగింది" అని పార్వతీశం జవాబు చెప్పాడు.

"దీనికి నేను పెడితే అన్నీమార్గాలే. అయినా నేను ఈఅల్లరి మాపుచెయ్యాలని నిశ్చయించుకున్నాను. ఆమెని మీ రెలా స్వీకరించ దలిచారో దయచేసి చెబుతారా?"

"ఆమె కిలాంటి వుద్దేశం వున్నట్లు గాని, ఆమె నాయింటికి వస్తుం దని గాని యిప్పటిదాకా నేనెరగను. మీకంటె పావుగంట ముందే ఆమె మాయింటికి వచ్చింది. అయినా నే నేమీ ఆక్షేపించకుండా ఆమెని స్వీకరించాను. ముందు సంగతి ఆలోచించడానికి నా కింకా అవకాశం కలగలేదు. అయినా మీ సలహా కోరుతున్నాను."

"మీ కుటుంబమర్యాదా, ఆమె తండ్రి కుటుంబ మర్యాదా కరణం చాలా హెచ్చుగా చెప్పాడు. క్షుద్రులవలె మీ రిద్దరు అక్రమసమ్మంధంతో వుండడం మంచిది కాదు; కనక శాస్త్రోక్తంగా వివాహం—"

"తమ సెలవుకి బద్ధుడనై వుంటాను"

"సంతోషం"

ఇలా చెప్పి దొర "ఆమె నోమాట నాయెదటికి తీసుకొనివస్తారా?" అన్నాడు. దానిమీద పార్వతీశం రెడ్డికేసి చూడగా రెడ్డి పడమటింటి గుమ్మందాకా వెళ్లి రత్తమ్మని పిలిచి సంగతి చెప్పాడు. వెంటనే రంగనాయిక గుమ్మం దగ్గిరికి వచ్చి నుంచింది.

అప్పుడు దొర ముందువాదాకా వెళ్లి "మిమ్మల్ని గాని, మీ ప్రియులయిన పార్వతీశంగార్ని గాని యెవరూ యేమీ చెయ్యలేరు. మీ తెలివితేటలికి చాలా ఆనందించాను. మీరు వారిని శాస్త్రోక్తంగా మళ్లీ పెళ్లి చేసుకుని సుఖపడండి" అని చెప్పాడు. సిగ్గుపడి ఆమె వూరుకుంది. "మీనగలు తెప్పించాను, పుచ్చుకుంటారా?" అని దొర మళ్లీ అడగ్గా ఆమె "చిత్తం" అంది.

అప్పుడు దొర వీథిలో వున్న భీమన్నశాస్త్రిని రప్పించి "నగలు అక్కడ పెట్టండి" అన్నాడు. తల వంచుకునే వుండి అతను మూట అక్కడ పెట్టగా "విప్పి వొక్కొక్కటే అప్పగించండి" అన్నాడు.

భీమన్నశాస్త్రికి తల కొట్టేసినట్లయింది. అయినా కేసు యెదురుతిరక్కుండా వుండాలంటే కిక్కురుమనకూడదని అత నెరుగును.

కంటె, కాసులపేరు, పుస్తెలనానూ, గడియారపు గొలుసు, మూడు జతల బంగారపు గాజులు, వొడ్డాణం (పువ్వుతో కూడానూ), సీమకమలాల కమ్మలు, పాంజేబు పట్టీలు, ముక్కుపుడకలు, బంగారపు కుంకుమబరిణి, వెండిగిన్ని, వెండి గళాసు, నాగపురి వంకీ, రెండు వుంగరాలు—యిలాగ వొక్కొక్కటే భీమన్నశాస్త్రి తల వంచుకునే—వొక్కమాటు మాత్రం తీక్ష్ణంగా చూసి వొక్కొక్కటే అందించాడు. రంగనాయికమ్మగూడా అలాగే చూసి వొక్కొక్కటే అందుకుని తలుపు చాటున వున్న జానకమ్మ కందించింది. ఆసన్నివేశం భీమన్నశాస్త్రి, యిప్పటి దాకా పురుషులు చెలాయించిన అధికారాన్ని స్త్రీల కప్పగించిన ట్టుంది.

వప్పగింత లయిపోయాయి. దొర బయలుదేరి వీథిలో నుంచుని, అందర్నీ తేరి చూసి, భీమన్నశాస్త్రినీ, పార్వతీశాన్నీ ప్రత్యేకంగా పిలిచి, "మీకు రాజీ చేశా నని తెలుస్తున్నాను. ఈ వుద్దేశంతోటే యీ కేసు మాపు చేశాను. మీ రిద్దరూ యీఅగ్రహారంలో పెద్ద పెద్ద భూస్వాములై వున్నారు. అకారణంచేత మీ అధీనములో చాలా మందిర యితులూ, కార్మికులూ వున్నారు. మీబుద్ధులు వక్రిస్తే దొమ్మి జరుగుతుంది, కాని అలాంటిది తటస్థిస్తే మాత్రం సర్కారు మిమ్మల్ని శిక్షిస్తారు. సమూలంగా విచ్ఛిన్నం చేసేస్తారు. కాబట్టి న్యాయంగా ప్రవర్తించి సుఖపడండి. రంగనాయికమ్మ సాహసంవల్ల మీ రెండు కుటుంబాలికీ దగ్గిర చుట్టరికం కలిగింది. దాన్ని పోషించుకోండి" అని చెప్పి అడుగు వేశాడు. భీమన్నశాస్త్రి మొగం మాడ్చుకునీ, పార్వతీశం అత్యుత్సాహంగానూ సెలవు పుచ్చుకున్నారు. మునసబు పొలిమేరదాకా సాగనంపి గంపెడు చివాట్లు తెచ్చుకున్నాడు.

౧౪

పార్వతీశం తాపితా కట్టుకుని వెళ్లి పీటమీద కూచునే టప్పటికి యెడా పెడా చెరో అప్సరసా—జానకమ్మా రంగనాయికమ్మా కూచుని వున్నారు. మాడగా రంగనాయికమ్మ అప్పుడే తలంటుకోవడంచేత మెరు

గొక్క చిక్కు తీయబడి ఆరుతూ వున్న దీర్ఘ శిరోజముల తోడను, సకలాభరణములతోడను, పట్టుచీర ధరించి, కళ్లకి కాటుకా, నొసట కుంకుమబొట్టూ—పూర్తిగా పుణ్యస్త్రీ అయివుంది. రత్తమ్మ నేతిగిన్నె పట్టుకుని వడ్డించడానికి సిద్ధంగా వుంది.

రంగనాయికమ్మ తల వంచుకుంది. జానకమ్మ ముఖంమీద అనంతప్రేమా, విజయగర్వమూ నృత్యం చేస్తున్నాయి. రత్తమ్మ మందహాసం చేస్తోంది.

పార్వతీశం మొదట ఆశ్చర్యాన్ని ప్రకటించి ప్రశంస చేసి చివరికి జానకమ్మని కొండ యెక్కించాడు

అయినా ఆపూటమాత్రం ముగ్గురూ కూడా కొంచెంకొంచెం సిగ్గుతోనే భోజనం చేశారు.

*　　*　　*

భోజనానంతరం పడకకుర్చీలో పడుకుని వున్న భర్తకి తాంబూలం అందిస్తూ జానకమ్మ "కృష్ణయాజులు గారి అల్లుడికి చెన్నాపట్టం వుత్తరం రాయండి" అంది. అత "నెందుకూ?" అన్నాడు. అందు కామె "పెళ్లి చేసుకోకపోతే నేను వొప్పుకోను బాబూ" అని చురచుర చూస్తూ తల అడ్డంగా వూపింది.

మ న స్సు

క్రొత్తపల్లి సూర్యారావుగారు

మనసు ప్రధాన మింతకును మానసమే గుఱి మెట్టికార్యముం
　　బూనరుప మాన దానివశముంబడ కెవ్వఁడు నుండలేఁడు నుం
డని యతఁ డింద్రియార్థముల డగ్గఱనీయక నిగ్రహించినాఁ
డనఁ జను, రాజు మానసము నన్యములన్నియు దాని బానిసల్.

నాయిష్టము నామన సని-నీయధికారంబు దెల్పుఁ నినుఁ గని నవ్వం
బాయనివగపుం గదురును - మాయయు మానసము రెండుమాటలు నొకఁడే.

మన సన భ్రాంతియన్న నొకమాటయె యందును నేను దానిలోఁ
గనుఁగొనుమయ్య యంతరము గల్గునొ యించుక యంచు వ్యర్థ మా
పని, విను పగ్గముం గనినఁ బామను భ్రాంతి జనింపలేదె, పా
మును గని ప్రస్ఫురిమం గొనదె ముగ్ధము చిత్తము కొన్నివేళలన్.

చిత్తమునాఁగ నేమి యని చేయకుప్రశ్నము మానసంబునే
చిత్తమటంద్రు పెక్కులగు చిన్నెలు వన్నెలు దాల్చునద్ది నీ
చిత్తము దానిభాగ్యమును జేకొన రాతుకొలంది గుఱ్ఱమూఁ
గత్తఱపెట్టు సద్దడఁగుఁ దత్త్వమెఱుంగుము బుద్ధిశాలి వై.